# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 72 24-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 5 రోజులు దాడులకు విరామం: ట్రంప్

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తాత్కాలిక ఉపశమనం
- దాడులు వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశం
- ఇంధన కేంద్రాలపై దాడులు 5 రోజులు నిలిపివేత
- చమురు మార్కెట్లలో భారీ పతనం..
- 'ట్రంప్ వెనక్కి తగ్గారు' అంటూ ఇరాన్ వ్యాఖ్యలు



2లో




## క్యూనెట్ మోసం బట్టబయలు..
## 32మంది అరెస్టు

- 3 రాష్ట్రాల్లో సోదాలు.. సీసీఎస్ భారీ ఆపరేషన్
- 30 బృందాలతో దాడులు.. కీలక నిందితుల పట్టివేత
- ఐటీ ఉద్యోగులే ఎక్కువగా నిందితుల్లో ఉండటం విశేషం

## సన్న బియ్యానికి బోనస్ తప్పదు

- రైతులకు అండగా నిలుస్తాం: మంత్రి ఉత్తమ్
- ధాన్యం కొనుగోళ్లలో రికార్డు.. 72 లక్షల టన్నులు సేకరణ
- ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న భరోసా
- రబీ సీజన్‌లోనూ పూర్తి స్థాయి కొనుగోళ్లు



2లో

# ప్రజలకు ఎటువంటి నష్టం ఉండదు



- మెరుగైన వసతులతో పునరావాసం.. ఎవరినీ నిరాశ్రయులను చేయం
- అపోహలు నమ్మొద్దు.. రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టొద్దు
- సూచనలు ఇస్తే స్వాగతం.. అవసరమైతే కేబినెట్ సబ్ కమిటీ
- మూసీ ప్రక్షాళన తప్పనిసరి.. కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- హైదరాబాద్ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్.. మెట్రో విస్తరణ, కారిడార్లు
- ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం.. అండర్‌పాస్, ఎలివేటెడ్ ప్రాజెక్టులు

2లో



# ఏపీలో మెగా స్టీల్ సిటీ.. రూ.1.36 లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్

- రూ.1.36 లక్షల కోట్లతో మెగా స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం
- నక్కపల్లిలో 'స్టీల్ సిటీ'గా అభివృద్ధి లక్ష్యం
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి టార్గెట్
- వేలాది ఉద్యోగాలు.. ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్పు


2లో

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో భారీ ఉక్కు పరిశ్రమకు అంకురార్పణ జరిగింది. సుమారు 1.36 లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ పరిశ్రమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు హెచ్.డి. కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మ , మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నక్కపల్లిలో ఏర్పాటు కాబోతున్నది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదని, ఇది ఒక సంపూర్ణ 'స్టీల్ సిటీ'గా అవతరించబోతోందని ప్రకటించారు. గతంలో విశాఖ ఉక్కును పోరాడి సాధించుకుంటే, ఆర్సెలార్ మిట్టల్ సంస్థ మన రాష్ట్రంపై ఉన్న నమ్మకంతో ఇక్కడికి రావడం విశేషమని, కేవలం 20 నెలల కాలంలోనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఈ మెగా ప్రాజెక్టును సాకారం చేసి చూపించామని ఆయన గర్వంగా పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో అన్ని 'గాలి మాటలు'... వాస్తవాలకు దూరం!

- స్వచ్ఛత, స్పష్టత, విశ్వసనీయత కనిపించలేదు: హరీశ్
- హామీలకు అరకొర నిధులు.. మేనిఫెస్టోను మర్చిపోయారు
- రైతు రుణమాఫీ అమలు కాలేదన్న ఆరోపణ..
- బోనస్ 'బోగస్'గా మారిందని వ్యాఖ్య
- నిరుద్యోగులకు దక్కింది నిరాశే.. జాబ్ క్యాలెండర్ గల్లంతు
- సంక్షేమ పథకాల అమలులో తీవ్ర లోపాలు..
- యువత, మహిళలకు న్యాయం లేదని విమర్శ





## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

**ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్**

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును

# కఠిన సవాళ్లకు రెడీ ఉండాలి



- లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన
- గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు.. అప్రమత్తంగా కేంద్రం
- భద్రతకు ప్రాధాన్యం.. వేల మంది స్వదేశానికి తరలింపు
- ముడి చమురు, వాణిజ్యంపై ప్రభావం.. ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు
- ఎల్పీజీ కొరత లేకుండా చర్యలు.. సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఇంధన దిగుమతుల విస్తరణ.. వ్యూహాత్మక నిల్వల పెంపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం భారత్‌కు అనేక సవాళ్లను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన, గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని చెప్పారు. ఈ పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తున్నామని తెలిపారు. (మిగతా 2వ పేజీలో)

## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

(మొదటి పేజీ తరువాయి)

మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను“ అని అన్నారు. పర్యావరణ శాఖ మంత్రి హోదాలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. “ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కర్బన ఉద్గారాలను (కార్బన్ ఫుట్‌ప్రింట్) పరిమితం చేసేలా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్న సంస్థలను మేం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం“ అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్యూనెట్ మోసం బట్టబయలు.. 32మంది అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా కోట్ల రూపా యల మోసాలకు పాల్పడుతున్న క్యూనెట్ కేసు లో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో 32 మంది నిందితులను అరెస్టు చేసి నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. మూడు రాష్ట్రాల్లో సమన్వ యంతో సోదాలు నిర్వహించి ఈ అరెస్టులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్ కోసం హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు 30 బృందాలుగా విడిపోయి విస్తృతంగా దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు మరియు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులు ఉండటం గమనార్హమని పేర్కొ న్నారు. ఇప్పటివరకు నమోదైన నాలుగు కేసుల్లో కనీసం 11 మంది బాధితులు సుమారు రూ.75 లక్షల మేర మోసపోయినట్లు గుర్తించా మని సీపీ వివరించారు. ఈ మోసం మరింత విస్తృతంగా ఉండే అవకాశముందని భావిస్తూ, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో జరిగే ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. ఇలాంటి పథకాలలో చేరడం, ఇతరులను చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## సన్న బియ్యానికి బోనస్ తప్పదు

హైదరాబాద్ : సన్న బియ్యానికి బోనస్ ఇవ్వడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. శాసనసభలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం రైతుపక్షపాత విధానాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. రైతుల నుంచి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 72 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించి, రైతులకు నగదు చెల్లింపులు పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. ఇంకా మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రబీ సీజన్‌లో ప్రతి గింజను సేకరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులు వచ్చినా రాకపోయినా, రైతులకు నష్టం కలగకుండా కొనుగోళ్లు కొనసాగిస్తామని చెప్పారు. తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని మంత్రి తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 86 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉన్నదని, వాటిని ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోనా మసూరి, బాస్మతి వంటి బియ్యాలకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మంచి డిమాండ్ ఉందని వివరించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. ఆ ప్రభుత్వం హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత పాలనలో జరిగిన అన్ని అక్రమాలపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని తెలిపారు. మొత్తంగా రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపుల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం అందించే లక్ష్యంతో ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు.


## 5 రోజులు దాడులకు విరామం: ట్రంప్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు గడువు విధించిన నేపథ్యంలో, ప్రస్తుతం జరుగుతున్న చర్చల కారణంగా ఇరాన్‌పై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని ఇంధన మౌలిక వసతులు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులపాటు వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశించినట్లు తెలిపారు. చర్చల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో వెంటనే ప్రభావం కనిపించింది. ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. ఒకే రోజులో గణనీయంగా తగ్గి, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి తగ్గిన సంకేతాలు కనిపించాయి. మరోవైపు, ట్రంప్ ప్రకటనపై ఇరాన్ భిన్నంగా స్పందించింది. తమ హెచ్చరికల కారణంగానే అమెరికా వెనక్కి తగ్గిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార మాధ్యమం పేర్కొంది. అయితే ఇరాన్ పార్లమెంట్ స్పీకర్

# ఏపీలో మెగా స్టీల్ సిటీ.. రూ.1.36 లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్లాంట్‌తో పాటు సుమారు 11,198 కోట్లతో ప్రత్యేక క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం కానుంది. పరిశ్రమకు అవసరమైన ముడి ఇనుము సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తిని ప్రారంభించి, 2030 డిసెంబర్ నాటికి రెండు భారీ బ్లాస్ట్ ఫర్నేస్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భారీ పరిశ్రమ కేవలం ఉక్కు ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకుండా, ఆర్థిక లావాదేవీలతో పాటు విద్య, వైద్యం , వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా అత్యంత వేగంగా భూసేకరణ , అనుమతులు ఇచ్చింది ఏపీలోనేనని, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం ఉందని, నిపుణులు , మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతమని చంద్రబాబు పేర్కొన్నారు. టూరిజం నుంచి డేటా సెంటర్ల వరకు, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకు అన్నింటికీ ఇక్కడ మెండైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ‘వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్’ అనే నినాదాన్ని విజయవంతం చేస్తామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు కాబోతోందని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం రాష్ట్రానికి గర్వకారణమని, బీపీసీఎల్ వంటి పెద్ద పరిశ్రమలు కూడా ఇక్కడికి వస్తున్నాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో రాష్ట్రానికి సుమారు 20.35 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ , ఐటీ సెంటర్లకు కీలక కేంద్రంగా మారుతుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ ప్రాంతం త్వరలోనే రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని, కొత్తగా పోర్టులు , విమానాశ్రయాలు వస్తున్నాయని, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా పూర్తి చేసేందుకు అన్ని రకాల సహకారం అందిస్తామని, భూములు ఇచ్చిన రైతులకు అండగా



ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరిశ్రమలో మొదటి ప్రాధాన్యతగా అనకాపల్లి జిల్లా యువతకే ఉద్యోగాలు కల్పించాలని సంస్థను కోరారు. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు సంస్థ ప్రతినిధులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

# కఠిన సవాళ్లకు రెడీ ఉండాలి

ఎల్పీజీ సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధాని పేర్కొన్నారు. ము ఖ్యంగా భారత్‌కు ముడి చమురు, వాయువు ఎక్కువగా గల్ఫ్ దేశాల నుంచే వస్తున్న నేపథ్యంలో ఈ యుద్ధం ప్రభావం మ రింతగా ఉంటుందని అన్నారు. వాణిజ్య రవాణా కూడా అంత రాయం ఎదుర్కొంటోందని తెలిపారు. ఆ ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారని, నౌకాయాన రంగంలో కూడా అనేక మంది భారతీయులు పనిచేస్తున్నారని చెప్పారు. వారికి అవసరమైన సహాయం అందించేందుకు భారత దౌత్య కార్యాలయాలు నిరంతరం కృషి చేస్తున్నాయని వెల్లడించారు. భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని స్పష్టం చేశారు.



యుద్ధం ప్రారంభ మైనప్పటి నుంచి లక్షలాది మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. విద్యార్థులను కూడా సురక్షితంగా తరలించే చర్యలు చేపట్టామని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షల నిర్వహణపై కూడా చర్యలు తీసుకు న్నామని వెల్లడించారు. ఇంధన అవసరాల విషయంలో కేంద్రం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దేశీయం గా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నామని, పెట్రోల్, డీజిల్ సర ఫరా సజావుగా కొనసాగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఇంధన దిగుమతుల కోసం దేశాల సంఖ్యను గణనీయంగా పెంచినట్లు వివరించారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను కూడా పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని చెప్పారు. ఈ సంక్షోభాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి ఎదుర్కోగలవని విశ్వాసం వ్యక్తం చేశారు. యూరియా, ఎరువుల విషయంలో రైతులకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చివరగా, పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కోసం దౌత్య చర్చల మార్గాన్నే భారత్ ప్రోత్సహిస్తోందని ప్రధాని పునరుద్ఘాటించారు.

## బడ్జెట్‌లో అన్నీ ‘గాలి మాటలు’... వాస్తవాలకు దూరం!

హైదరాబాద్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. బడ్జెట్‌లో స్వచ్ఛత, స్పష్టత, విశ్వసనీయత పూర్తిగా లోపించాయని, ఇది వాస్తవాల కంటే ‘అవాస్తవాల కోట’లా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన భారీ హామీలకు సరిపడా నిధులు కేటాయించలేదని, ప్రజలను మోసం చేసే విధంగా బడ్జెట్‌ను రూపొందించారని ఆరోపించారు. రైతుల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, రైతు పరిస్థితి మరింత దారుణంగా మారిందని అన్నారు. ‘అభయహస్తం’ పేరుతో వచ్చిన పథకాలు రైతుల పాలిట ‘భస్మాసుర హస్తం’గా మారాయని విమర్శించారు. గతంలో కరోనా కష్టకాలంలో కూడా రైతుబంధు అమలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతులకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. పంటల బీమా ప్రస్తావన లేకపోవడం, బోనస్ చెల్లింపులు నిలిచిపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలపై కూడా ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని, నిరుద్యోగులకు ఉపాధి కాకుండా నిరాశ మాత్రమే దక్కిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులపై ఒత్తిడి, నిర్లక్ష్యం పెరిగిందని ఆరోపించారు. యువత, మహిళల కోసం ప్రకటించిన పథకాలు కూడా అమలులో విఫలమయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ‘రాజీవ్ యువ వికాసం’ వంటి పథకాలకు నిధులు కేటాయించినప్పటికీ, వాటి ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరలేదన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను బయటపెట్టాలని, లేకపోతే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం ప్రకటించిన పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, వాస్తవంలో ఆ వర్గాల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని హరీశ్‌రావు ఆరోపించారు.

# ప్రజలకు ఎటువంటి నష్టం ఉండదు

హైదరాబాద్ : మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరికీ నష్టం జరగదని, ఎవరినీ నిరాశ్రయులను చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలు సమయంలో ప్రభావితులైన వారికి సముచిత పునరావాసం కల్పించి, మెరుగైన వసతులతో తరలిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు సృష్టిస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని, రెచ్చగొట్టే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రాజెక్టును ఆపాలని కాకుండా, దాన్ని మెరుగ్గా అమలు చేసే దిశగా సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు. అవసరమైతే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి సూచనను 100 శాతం అమలు చేస్తామని స్పష్టం చేశారు. మూసీ నది కాలుష్యం తీవ్రమైందని, నల్లగొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూస్తే ప్రక్షాళన అవసరం ఎంత ఉందో అర్థమవుతుందని సీఎం పేర్కొన్నారు. జంతువుల అవశేషాలు, మురుగు, కాలుష్యంతో నది నీళ్లు ప్రమాదకరంగా మారాయని, అది పంటలపై, భూగర్భ జలాలపై, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వివరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం గోదావరి జలాలను మూసీలోకి తీసుకురావాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బఫర్ జోన్ అంశంపై మాట్లాడుతూ, గతంలో 9 మీటర్లుగా ఉన్న పరిమితిని 50 మీటర్లకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. దాని ప్రకారం



కొన్ని నిర్మాణాలు సమస్యల్లో పడే అవకాశముందని, ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అవసరమైతే భూములకు నష్టపరిహారం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ దృష్టితో నగరాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను నగర బయటకు తరలించి, నివాసయోగ్యమైన నగరంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒకే విధమైన పరిపాలన కోసం కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు, పోలీసు కమిషనరేట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మెట్రో రైల్వే విస్తరణపై మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టును ప్రభుత్వం తిరిగి చేపడుతోందన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకుని, నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు, గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట, రాయిదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మొత్తం 76 కిలోమీటర్ల మేర విస్తరించనున్నట్లు వివరించారు. దీనికి కేంద్రం కూడా సహకరిస్తోందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, సర్ఫేస్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హిమాయత్‌సాగర్ నుంచి గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ద్వారా నగర రద్దీ తగ్గుతుందని తెలిపారు. అలాగే బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం దేశంలోనే ప్రత్యేకమని పేర్కొన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యమని, వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని సీఎం చెప్పారు. మల్టీ లెవల్ పార్కింగ్ వ్యవస్థలను కూడా ప్రవేశపెడుతూ నగర ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



# మీసేవ.. అంతా వారిష్టమే!

- నిర్దేశిత ఛార్జీల కంటే అదనపు వసూళ్లు
- రసీదులు ఇవ్వకుండానే దరఖాస్తుదారుల నుంచి నగదు స్వీకరణ
- నిబంధనలకు తిలోదకాలు.. వినియోగదారుల అసహనం
- ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల్లో యథేచ్ఛగా దందా

**వలిగొండ, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలు కొన్ని చోట్ల అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తూ నిర్వాహకులు సామాన్యులను దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం బోర్డు మీద సేవల ధరల పట్టిక ప్రదర్శించాల్సి ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా తమకు తోచిన రీతిలో రేట్లు నిర్ణయించి వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### రసీదు ఇవ్వకుండానే 'నంబర్'తో సరి..

మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భూ వ్యవహారాలకు సంబంధించిన పన్నుల చెల్లింపులు, ఆధార్ వంటి కీలక సేవల కోసం వచ్చే దరఖాస్తుదారులకు మీసేవ నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. నగదు తీసుకున్న తర్వాత అధికారిక రసీదులు ఇవ్వకుండా, కేవలం అప్లికేషన్ ఫారంపై రసీదు నంబర్ వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. రసీదు అడిగితే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, ప్రశ్నిస్తే పనులు కావని బెదిరింపు ధోరణి ప్రదర్శిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

### నిరుద్యోగులపై అదనపు భారం:

ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు ప్రక్రియలో ఈ అక్రమాలు పరాకాష్టకు చేరాయి. రుణం కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే రెట్టింపు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఆధార్ కేంద్రాల్లోనూ ఇదే తరహాలో ఆధార్ అప్‌డేషన్ కోసం వచ్చే వారి నుంచి అడ్డగోలుగా డబ్బులు లాగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

### పర్యవేక్షణ కరవు.. చర్యలేవి?

వలిగొండ మండలంలో మీసేవ నిర్వాహకులు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే నిర్వాహకుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా అధిక వసూళ్లకు పాల్పడుతున్న మీసేవ, ఆధార్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## చిన్ననాటి మిత్రుడికి చేదోడు.. రూ. లక్ష విరాళం

– మానవత్వం చాటుకున్న 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** పదో తరగతిలో కలిసి చదువుకున్నారు.. ఆటపాటల్లో ఒకరికొకరు తోడయ్యారు. కాలక్రమేణా జీవనోపాధిలో ఎవరి దారి వారు చూసుకున్నా, ఆ 'బాల్య స్నేహం' మాత్రం అలాగే సజీవంగా ఉంది. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తన తోటి మిత్రుడు ఐతరాజు నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆ మిత్రులంతా ఏకమయ్యారు. 1998-99 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. హనుమాన్ నగర్‌లోని నాగరాజు నివాసానికి వెళ్లిన స్నేహితులు, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తమ వంతు సాయంగా సేకరించిన రూ. లక్ష నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ మిత్రుడు దూరం కావడం తీరని లోటని, అతడి పిల్లల భవిష్యత్తు కోసం చిన్నపాటి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, కృష్ణ, శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో స్పందించిన మిత్రుల తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## పంతంగిలో జనత ఆరోగ్య సమితి సమావేశం



**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల' సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది కోరారు. సోమవారం పంతంగి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో 'జనత ఆరోగ్య సమితి' అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి వివరించారు. అర్హులైన వారందరూ ఈ టీకా తీసుకోవాలని సూచించారు. అనంతరం రాబోయే రోజులలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్ఎం ఇందిర సూచించారు. గ్రామంలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో సహకరిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులను వైద్య బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత వైద్య శిబిరం

- 70 జీవాలకు టీకాలు, గర్భకోశ పరీక్షలు
- ప్రారంభించిన రాఘవపురం సర్పంచ్ మమత


**ఆలేరు, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాఘవపురం గ్రామ సర్పంచ్ మమత సంతోష్ కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని రాఘవపురంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 70 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడంతో పాటు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల దృష్ట్యా పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పశు వైద్యాధికారులు డాక్టర్ చైతన్య, డాక్టర్ నవీన్, గోపాలమిత్ర సూపర్వైజర్ భాను, వి.ఎల్.వో శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల నరేష్, వార్డ్ సభ్యులు జవ్వాజి ప్రదీప్, ఎర్ర దేవేంద్ర, తుంగ సుస్మిత, గోపాలమిత్రలు కృష్ణ, సుధాకర్, శ్రీకాంత్, కుమారస్వామి, వరలక్ష్మి, రైతులు కరికి బీరయ్య, వస్పరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు -
నమ్మకాన్ని వమ్ము చేయను: మాజీ జెడ్పీటీసీ

**రాజపేట, మార్చి 23 తొలివెలుగు న్యూస్)::** నందిగార్డెన్45 మండలం నర్సాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ నాగిర్తి రాజిరెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సోమవారం ఆయన తన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. రాజిరెడ్డి నియామకం పట్ల నర్సాపురం గ్రామ నేతలు, మండల కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.



## ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదగిరిగుట్ట, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్ల ఏర్పాటు వంటి మౌలిక వసతులపై ఆరా తీశారు. పరీక్ష పూర్తయిన అనంతరం ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తుతో సురక్షితంగా తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ద్రవిడ సంస్కృతికి జాంబవంతుడే మూలాధారం

- టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్
- కొలనుపాక ఆది జాంబవ దేవాలయంలో ప్రత్యేక పూజలు
- మాదిగల ఆరాధ్య దైవంగా జాంబవంతుడు: వంగపల్లి
- 2027లో భారీ జాంబవ జాతరకు సన్నాహాలు
- దేవాలయ నిర్మాణానికి రూ.1000 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్

**ఆలేరు, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** ద్రవిడ సంస్కృతికి ఆది జాంబవంతుడే మూలాధారమని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో వెలిసిన ఆది జాంబవ దేవాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన కాలంలో భారతదేశాన్ని 'జంబూ ద్వీపం'గా పిలిచేవారని, ఆ ద్వీపాన్ని పాలించిన ఘనత జాంబవంతుడిదేనని గుర్తు చేశారు. మాదిగల ఆరాధ్య దైవమైన జాంబవంతుడు భూమి కంటే ఆరు నెలల ముందే జన్మించాడని పురాణాలు చెబుతున్నాయని, వ్యవసాయానికి ఆయనే బీజం వేశారని వివరించారు. దేశంలో ప్రస్తుతం దళితులపై దాడులు పెరగడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మాదిగ సమాజం తరతరాలుగా మానవాళికి రక్షణ కల్పిస్తోందని, వారి ఆత్మగౌరవాన్ని చాటేలా 2027 మార్చిలో కొలనుపాకలో లక్షలాది మందితో భారీ జాతర నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, జాంబవ దేవాలయ అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోత్కూరి ఐలయ్య, మామిడాల నరసింహులు, వానరాశి నరసింహులు, గంధమల్ల నరేష్, గంధమల్ల స్వామి, గ్యార మల్లేష్, వదిలేసి రమేష్, తారాల అంజయ్య, తక్కల ఎల్లయ్య, గ్యార మల్లయ్య, బొంకురి సంతోష్, గుండె యాదగిరి, బొంకురి రాములు, జంగా రాములు, జంగస్వామి, వార్డ్ సభ్యులు బొంకూరి మల్లయ్య, పైసా సంతోష్, రవి, అందే సుధాకర్, కందుల రామన్ తదితరులు పాల్గొన్నారు.







## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం
- కలెక్టరేట్‌లో 52 అర్జీల స్వీకరణ

**యాదాద్రి భువనగిరి, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అర్జీదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో మొత్తం 52 దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 39 వినతులు వచ్చాయని తెలిపారు. డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి 5, మిగిలిన శాఖలకు ఒక్కోటి చొప్పున అందాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభ రాణి, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# ఉపాధి నిధుల మళ్లింపుపై సర్పంచుల ధర్నా

- ఎమ్మెల్యే, ఎంపీల ఒత్తిడితోనే నిధులు గోల్‌మాల్?
- ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల మళ్లింపుపై ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా
- మెటీరియల్ కంపోనెంట్ నిధులు విడుదల చేయాలని సర్పంచుల డిమాండ్
- అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన





**ఆత్మకూర్ (ఎం), మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** 025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ (ఉపాధి హామీ పథకం) నిధుల మంజూరులో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్, బీజేపీకి చెందిన సర్పంచులు, నాయకులు ఆత్మకూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. సర్పంచులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామాలలో లేబర్ కంపోనెంట్ కింద దాదాపు రూ.50 లక్షల పనులు కూలీల చేత పూర్తి చేయించినప్పటికీ, వాటికి అనుగుణంగా ఇవ్వాల్సిన మెటీరియల్ కంపోనెంట్ నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని పేర్కొన్నారు. సాధారణంగా ఈ పనులకు 40 శాతం మేర మెటీరియల్ కంపోనెంట్ కింద ఒక్కో గ్రామానికి రూ.20 నుండి 30 లక్షల వరకు నిధులు మంజూరు కావాల్సి ఉంటుందని తెలిపారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రభావంతో జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు ఉన్న గ్రామాలకు రావాల్సిన నిధులను కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఉన్న గ్రామాలకు మళ్లించారని ఆరోపించారు. ఈ కారణంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వంటి కీలక అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని సర్పంచులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమ గ్రామాలకు కేటాయించాల్సిన 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్ సర్పంచ్ బిసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సుంకరి మంజుల పరుశు రాం, గడ్డం ముత్తమ్మ, ఎరుకల యతిశ్వర్ గౌడ్, కొంగరి యాదగిరి, ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్ పాల్గొన్నారు. అలాగే బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బిసు చందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, యాస ఇంద్రారెడ్డి, భాషబోయిన ఉప్పలయ్య, కంభోజు భానుప్రకాష్, కోరె బిక్షపతి, పంజాల వెంకటేష్, దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి, సోమరాజు, కొల సత్తయ్య గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు గజరాజు కాశినాథ్, బండారి సత్యనారాయణ, సోలిపురం అరుణ, నాతి రాజు గౌడ్, ఎరుకల స్వామి, ఎలందర్, గడ్డం సతీష్, గడ్డం అశోక్, యాటమధు, బొక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.




## దివిస్ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా మాసోత్సవాలు

- చౌటుప్పల్‌లో ఘనంగా వాహనాల ర్యాలీ
- ప్రారంభించిన ట్రాఫిక్ సీఐ ఆంజనేయులు

**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చౌటుప్పల్ ట్రాఫిక్ అధికారి ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని దివిస్ పరిశ్రమలో సోమవారం 55వ జాతీయ భద్రతా మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వందలాది మంది దివిస్ ఉద్యోగులు భద్రతా నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దివిస్ సేఫ్టీ అధికారులు మహేష్, రంగారావు, దుర్గాప్రసాద్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## దివిస్ సహకారంతో అంకిరెడ్డిగూడెం అభివృద్ధి



- రూ. 98.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- శంకుస్థాపన చేసిన దివిస్ జీఎం సుధాకర్, సర్పంచ్ మల్లేష్ గౌడ్
- మహిళా మండలి భవనం ప్రారంభించిన అతిథులు

**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామ అభివృద్ధికి దివిస్ పరిశ్రమ యాజమాన్యం భారీగా నిధులు కేటాయించింది. సోమవారం గ్రామంలో రూ. 98.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు పరిశ్రమ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్, సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 21.60 లక్షలతో నిర్మించిన మహిళా మండలి భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం సుధాకర్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. పరిశ్రమ యాజమాన్యం సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ఉప సర్పంచ్ వలండాసు మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ ముద్ధం సుమిత్ర సత్తయ్య గౌడ్, దివిస్ ప్రతినిధులు కిషోర్ కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ త్యాగం అజరామరం

- ఘనంగా విప్లవ వీరుడి 95వ వర్ధంతి
- భారతరత్న ప్రకటించాలని ఏఐవైఎఫ్ డిమాండ్

**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిదురపోయిన మహోన్నత విప్లవకారుడు భగత్ సింగ్ త్యాగం వెలకట్టలేనిదని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్ కొనియాడారు. సోమవారం పట్టణంలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశ విముక్తి కోసం చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన వీరుడు భగత్ సింగ్ అని స్మరించుకున్నారు. కులమతాలకు అతీతంగా సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన పోరాడారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆయనకు అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు 'భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్'ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు పగిళ్ల మోహన్ రెడ్డి, బద్దుల సుధాకర్, రొండి నర్సింహా, రాములు, దాసరి మనోహర్, దాసరి సిద్దు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థిగా మారిన డీఈవో!

- తరగతి గదిలో కూర్చుని పాఠాలు విన్న జిల్లా విద్యాధికారి
- మధ్యాహ్న భోజనం భేష్.. ఉపాధ్యాయులకు కితాబు

**రాజపేట, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ రాజపేట మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని రఘునాథపురం, రాజాపేటలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులతో కలిసి ఇంగ్లీష్ పాఠ్యాంశాన్ని అరగంటకు పైగా విని, బోధన పద్ధతులను పరిశీలించారు. ఆంగ్ల బోధనలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయురాలు జానకిని అభినందించారు. ఇంగ్లీష్ మీడియం పాఠశాల కావడంతో అన్ని విషయాలు ఆంగ్లంలోనే బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గదుల్లో గోడలపై ఉన్న తెలుగు సూక్తులను విద్యార్థులతో చదివించి, వాటి అర్థాలను వివరింపజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈవో స్వయంగా భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయితో పాఠశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. టీచర్ డైరీలు, ఇతర రికార్డులను పరిశీలించారు. పాఠశాలల పర్యవేక్షణ, ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణలో చూపుతున్న కృషికి మండల విద్యాధికారి చందా రమేష్‌ను ప్రశంసించారు. అలాగే పీఎం శ్రీ పాఠశాల వివరాలను ప్రధానోపాధ్యాయులు తడ్క రమేష్ ద్వారా తెలుసుకొని అభినందించారు.





## ఉగాది పురస్కారం అందుకున్న పబ్బోజు శోభారాణి

**రాజపేట, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** రాజపేటకు చెందిన ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణి ఉగాది పురస్కారం అందుకుని ప్రతిభ చాటుకున్నారు. త్రివేణి సంగమం కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ అధినేత డాక్టర్ రాజారామన్ చేతుల మీదుగా శోభారాణికి ఈ ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ, తన ప్రతిభను గుర్తించి పురస్కారం అందజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని శోభారాణిని అభినందించారు.

## ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహారెడ్డికి ఘన నివాళులు



**రాజపేట, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** స్వతంత్ర సమరయోధుడు ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి మనవడు ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహారెడ్డి రెడ్డి మృతి పట్ల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం జనగాం జిల్లా పెంబర్తిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అంత్యక్రియలకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం హాజరై మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుట్ల కుటుంబం స్వాతంత్ర్య పోరాటంలో చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## విద్యార్థుల కోసం వసతి గృహం నిర్మించాలి

- కలెక్టరేట్ 'ప్రజావాణి'లో ఎస్ఎఫ్ఐ వినతి
- వేలాది మంది విద్యార్థులకు ఇబ్బందులు: లావుడియ రాజు


**చౌటుప్పల్, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల (బీసీ) బాలురకు కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్‌తో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లావుడియ రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న చౌటుప్పల్ పట్టణంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు పది నుండి పన్నెండు వరకు ఉన్నప్పటికీ వసతి గృహం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మారుమూల గ్రామాల నుంచి రోజుకు మూడు వేల నుండి ఐదు వేల మంది విద్యార్థులు చదువుకోడానికి చౌటుప్పల్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల నుండి సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు సమయానికి కళాశాలలకు చేరుకోలేకపోతున్నారని, వసతి గృహం ఉంటే వారి విద్యాభ్యాసం సులభతరం అవుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి చౌటుప్పల్ పట్టణంలో బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ తరఫున డిమాండ్ చేశారు.





## రాజాపేటలో వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

**రాజపేట, మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల పరిధిలోని గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగవేణి, మండల పంచాయతీ అధికారి ఆవుల కిషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులకు వారి బాధ్యతలు, గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర, ప్రభుత్వ పథకాల అమలు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత..

# బీజేపీ నేతల అరెస్టు

**ఆటోలో అసెంబ్లీకి చేరుకున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**దూసుకొచ్చిన కార్యకర్తలు.. నినాదాలతో మార్మోగిన పరిసరాలు**

**బారికేడ్లు దాటేందుకు యత్నం.. పోలీసులతో తోపులాట**

**కార్యకర్తల అరెస్ట్.. మహిళలు, యువమోర్చా నేతలూ అదుపులో**

**ముందస్తు బందోబస్తు.. ఇళ్ల వద్దనే పలువురు నేతలకు హౌస్ అరెస్ట్‌లు**

**ఆరు గ్యారంటీల అమలుపై నిరసన.. 'చలో అసెంబ్లీ' పిలుపు**

**మోసపూరిత సర్కార్‌పై పోరాటం కొనసాగుతుందని బీజేపీ హెచ్చరిక**

**హైదరాబాద్ మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర బీజేపీ పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అసెంబ్లీ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు భారీగా మోహరించి నిరసనకారులను అడ్డుకోవడంతో ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల కళ్లకు గంతలు కట్టినట్టుగా ఆటోలో అసెంబ్లీ ప్రధాన గేటు వద్దకు చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఇతర నేతలతో కలిసి అక్కడే నిరసన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో నాంపల్లి పరిసర ప్రాంతాల నుంచి బ్యాచ్‌లుగా చేరుకున్న కార్యకర్తలు 'ఆరు గ్యారంటీలు ఎక్కడ' అంటూ నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు కదిలారు. బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బీజేపీ కార్యకర్తలు, నేతలు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేపట్టారు. మొత్తం 800 మందికి పైగా కార్యకర్తలు, సుమారు 50 మంది మహిళలు, యువమోర్చా కార్యకర్తలను అదుపులోకి తీసుకుని నగరంలోని తొమ్మిది పోలీస్ స్టేషన్లకు తరలించారు. రాంచందర్‌రావుతో పాటు పలువురు కీలక నేతలను అరెస్ట్ చేసి పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అనంతరం సాయంత్రం విడుదల చేశారు. అరెస్టులు కొనసాగుతూనే ఉండగా, ఐదు నుంచి పది మంది చొప్పున చిన్న చిన్న గుంపులుగా ఆటోలు, క్యాబ్‌లు ఉపయోగించి అసెంబ్లీ సమీపానికి చేరుకునే ప్రయత్నాలు కొనసాగాయి. వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పలువురు నేతలను వారి ఇళ్ల వద్దే హౌస్ అరెస్ట్ చేసి నిరసనను అణచివేయడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి పలు దఫాలుగా కార్యకర్తలు చేరుకోవడంతో ఎక్కడికక్కడ



నిరసనలు, అరెస్టులు కొనసాగాయి. అరెస్టయిన వారిలో పలు కీలక నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇకపై మరింత తీవ్రంగా నిలదీస్తామని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.




**హైదరాబాద్ మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా ఎగబాకి కొనుగోలుదారులకు చుక్కలు చూపించిన బంగారం.. ఇప్పుడు భారీ పతనంతో ఇన్వెస్టర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం తర్వాత కాస్త పుంజుకున్నట్లు కనిపించిన పసిడి ధర మళ్లీ నేలచూపులు చూస్తోంది. సోమవారం ఎంసీఎక్స్ కమోడిటీ మార్కెట్లో ఏప్రిల్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు 10 గ్రాముల రేటు ఏకంగా 10.3 (రూ.14,897) పతనమై.. రూ.1,29,595కు పడిపోయింది. ఈ ఏడాది జనవరి 29న నమోదైన రూ.1,93,096 ఆల్‌టైమ్ గరిష్ఠం నుంచి చూస్తే 33 శాతం (రూ.63,501) క్షీణించడం గమనార్హం. మరోపక్క, వెండి కూడా వెలవెలబోతోంది. ఏప్రిల్ కాంట్రాక్టు కేజీ ధర సోమవారం ఒకానొకదశలో రూ.27,248 దిగజారి రూ.,2,04,500 తాకింది. కాగా, ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాములు మేలిమి బంగారం ధర రూ.9,050 పడిపోయి రూ.1,43,600కు చేరింది. వెండి కేజీ రూ.10,500 నష్టంతో రూ.2,30,000కు తగ్గింది.

**అంతర్జాతీయంగా తీవ్ర హెచ్చుతగ్గులు..**

క్రూడ్ సెగలు, యుద్ధ ప్రకంపనలతో అంతర్జాతీయంగానూ బంగారం క్రాష్ అయింది. నైమెక్స్ ఏప్రిల్ ఫ్యూ చర్స్ ఔన్స్ ధర ఒక దశలో 10.4 శాతం (474.9 డాలర్లు) కుప్పకూలి 4,100 డాలర్ల కనిష్టాన్ని తాకింది. అలాగే వెండి ఔన్స్ రేటు సైతం 12 శాతం పైగా నష్టపోయి 61.23 డాలర్లకు దిగొచ్చింది. కాగా, ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన కేంద్రాలపై దాడులకు అయిదు రోజుల పాటు విరామం ఇస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో పసిడి, వెండి ధరలు భారీగా కోలుకున్నాయి. పసిడి ఔన్స్ సోమవారం రాత్రి 8 గంటల సమయంలో 2 శాతం నష్టంతో 4,550 డాలర్ల వద్ద, వెండి 1 శాతం లాభంతో 70.1 డాలర్ల వద్ద కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో రికవరీతో ఎంఎసీఎక్స్‌లోనూ బంగారం ధర రూ.1,41,388కి (నష్టం 2 శాతం) పుంజుకుంది. వెండి మళ్లీ లాభాల్లోకి వచ్చింది. అర శాతం పెరిగి రూ.2,34,155కు చేరింది.

**ఎందుకీ పతనం..**

పశ్చిమాసియాలో యుద్ధం దెబ్బకు క్రూడ్ భగభగలు... ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. బ్రెంట్ చమురు బ్యారెల్ ధర తాజాగా 119 డాలర్లను తాకడం, హార్ముజ్ జలసంధిని దాదాపు మూసివేయడంతో ఇంధన సరఫరాలకు తీవ్ర ఆటంకాలు తలెత్తుతున్నాయి. ఈ దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ భయాలతో ఆర్థిక అనిశ్చితి నెలకొంది. యూఎస్ ఫెడ్‌తో సహా పలు దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణం అంచనాలను పెంచడంతో వడ్డీరేట్ల పెంపు భయాలు మార్కెట్లను వెంటాడుతున్నాయి. వెరసి డాలరు విలువ పుంజుకోవడంతో బాండ్ ఈల్డ్‌లు ఎగబాకుతున్నాయి. ఈ అంశాలన్నీ బంగారం ధర వెలవెలబోయేలా చేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. 'తీవ్ర అనిశ్చితి నేపథ్యంలో బడా సంస్థాగత ఇన్వెస్టర్లు, ముఖ్యంగా అరబ్ గల్ఫ్ ప్రాంతానికి చెందిన ఇన్వెస్టర్లు బంగారం, ఇతరత్రా లిక్విడ్ అసెట్లను అమ్మేసుకుని, నగదు జమ చేసుకుంటున్నారు' అని ఆగ్మాంట్ రీసెర్చ్ హెడ్ రెనిషా చైనాని విశ్లేషించారు.

**వార్ బ్రేక్.. క్రూడ్ కూల్..**

ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన కేంద్రాలపై దాడులకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో క్రూడ్ రేట్లు చప్పున చల్లారాయి. నైమెక్స్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 10 శాతం మేర దిగజారి 88 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బ్రెంట్ రేటు సైతం 10 శాతం పడి 96 డాలర్లకు చేరింది. ఇంట్రాడేలో నైమెక్స్ 101 డాలర్లను, బ్రెంట్ 109 డాలర్లను తాకింది. ఇరాన్‌తో చర్చల్లో కాస్త పురోగతి నెలకొందని, అందుకే దాడులకు బ్రేక్ ఇస్తున్నామంటూ ట్రంప్ తాజా ప్రకటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే సంకేతాలు నెలకొన్నాయని, దీంతో క్రూడ్ ధరలు శాంతించాయని విశ్లేషకులు చెబుతున్నారు.



# ఫార్ములా ఈ–కార్ కేసులో ఛార్జిషీటు దాఖలు

**ఏ1గా కేటీఆర్, ఏ2గా అర్వింద్ కుమార్**

**55 కోట్ల నష్టం జరిగిందని కేసు నమోదు**

**కేటీఆర్ ఆదేశాలతోనే నిధుల విడుదల: అర్వింద్ కుమార్ వాంగ్మూలం**

**హైదరాబాద్ మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేస్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన అవినీతి నిరోధక శాఖ నాంపల్లి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇందులో ప్రముఖ నేత కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా చేర్చింది. అలాగే ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను రెండో నిందితుడిగా పేర్కొంది. ఇక హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు తదితరులను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చారు. విదేశీ సంస్థతో జరిగిన ఒప్పందంలో నిబంధనలను ఉల్లంఘిస్తూ నిధులు విడుదల చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిపిన కారణంగా ప్రభుత్వానికి సుమారు రూ.55 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏసీబీ తన దర్యాప్తులో పేర్కొంది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో అప్పట్లో పురపాలక శాఖలో ఉన్న ఉన్నతాధికారిగా పనిచేసిన అర్వింద్ కుమార్ కీలక వాంగ్మూలం ఇచ్చారు. కేటీఆర్ ఆదేశాల మేరకే నిధులను విడుదల చేసినట్లు ఆయన లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందూ, దర్యాప్తు సంస్థ ముందూ వెల్లడించినట్లు సమాచారం. ఈ కేసులో ఛార్జిషీటు దాఖలవడంతో తదుపరి న్యాయపరమైన ప్రక్రియలపై ఉత్కంఠ నెలకొంది. విచారణలో మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# మాగంటి ఇంట మరో ప్రమాదం

**ఓఆర్ఆర్‌పై డీసీఎంను ఢీకొట్టిన కారు గాయాలతో బయటపడ్డ మాగంటి కూతుళ్లు**



**హైదరాబాద్ మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** ఓఆర్ఆర్‌పై దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూతుర్లు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న డీసీఎం వ్యాన్ చక్రం ఊడిపోవడంతో వెనుక నుంచి వచ్చిన ఫార్చునర్ కారు అదుపు తప్పి డీసీఎంను ఢీకొట్టింది. కారులో ఉన్న వాళ్లందరు గాయాలతో బయటపడ్డారనే విషయం తెలియగానే అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి మాగంటి అక్షిత నాగ, మాగంటి దిశిర, దుర్గ సాయి అరికెపుడి, మేడిపల్లి అభిరామ్‌రెడ్డి తదితరులు ఫార్చునర్ కారులో శంషాబాద్‌లోని ఎయిర్ పోర్టుకు నుంచి ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్తున్నారు. నార్సింగి ప్రాంతంలోని టీజీపీఏ జంక్షన్ సమీపంలో ఐస్‌తో వెళ్తున్న డీసీఎం వెనుక టైరు బయటకు రావడంతో డీసీఎం అకస్మాత్తుగా నెమ్మదించింది. దీంతో వెనుక నుంచి వస్తున్న ఫార్చునర్ కారు అదుపు తప్పి డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. కారును దుర్గసాయి నడుపుతున్నాడు. కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. అక్షితను గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చేర్పించగా కోలుకుందని, ఎవరికి ప్రాణాపాయం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. స్నేహితులను ఎయిర్‌పోర్టులో దింపి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సమస్యల సుడిలో మెట్రో సాంకేతిక లోపాలు..

**హైదరాబాద్ మార్చి 23 (తొలివెలుగు న్యూస్):** మెట్రో ప్రాజెక్టు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఓవైపు తగ్గిపోతున్న ప్రయాణికుల రద్దీ, మరోవైపు తరుచు తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు మెట్రోను వెంటాడుతున్నాయి. దీనికి తోడు సర్కారు భుజాన వేసుకున్న స్వాధీన ప్రక్రియతో మెట్రో నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. దీంతో మెట్రో ప్రయాణికులు సమస్యలు తీవ్రత పెరుగుతుందే తప్ప.. సౌకర్యవంతమైన ప్రయాణం కరువైపోతుంది.తెలంగాణ పర్యాటకం ాహైదరాబాద్ నగరానికి ప్రధాన ప్రజా రవాణా వ్యవస్థగా ఎదిగిన మెట్రో రైలు.. నిర్వహణ నిర్లక్ష్యంతో సమస్యల ఊబిలో కూరుకుపోతుంది. మెరుగైన సేవలు అందించాల్సిన అధునాతన వ్యవస్థ కాస్తా.. కనీసం జనాల అవసరాలను గుర్తించలేకపోతుంది. ముఖ్యంగా పెరిగిన మెట్రో టికెట్ ధరలకు అనుగుణంగానైనా మెరుగైన సేవలు అందుతాయని ఆశించిన ప్రయాణికులకు నిరాశే ఎదురైతోంది. అదనంగా సాంకేతిక లోపాలు, సర్వీసుల్లో అంతరాయం, బ్రేక్ డౌన్ సమస్యలతోపాటు, పెరుగుతున్న ఆర్థిక భారం ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తరుచుగా తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో మెట్రో రైలు నిలిచిపోతూనే ఉంది. ఇక పీక్ అవర్స్‌లో పరిమితికి మించి ఆక్యుపెన్సీ చేరడంతో జనాలకు నిలబడే చోటు లేకుండా పోయింది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





‘ధమాకా’ తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన ‘భగవంత్ కేసరి’ హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.’స్కంద’ ‘ఆదికేశవ’ ‘ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్’ ‘గుంటూరు కారం’ ‘రాబిన్ హుడ్’ ‘జూనియర్’ ‘మాస్ జాతర’ ‘పరాశక్తి’ ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే

## కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది.మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది.



# రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా

తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.అయితే ఇటీవల మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న కథనాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయట. వ్యక్తిగత జీవితంలో ఇప్పటికే పెద్ద విషాదాన్ని ఎదుర్కొన్న మీనా, మళ్లీ ఇలాంటి అసత్య ప్రచారాలు తనను మానసికంగా బాధిస్తున్నాయని తెలిపారు. “నిజం ఏంటో తెలుసుకోకుండా, మీ ఇష్టం వచ్చినట్లు కథలు అల్లడం ఎంతవరకు కరెక్ట్ ?” అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఒక ఒంటరి మహిళనని, అంతేకాదు ఒక కుమార్తె తల్లినని గుర్తుచేశారు.

ఈ వార్తలు తన కూతురు చూసినప్పుడు ఆమె మనసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలంటూ మీడియా, సోషల్ మీడియాను కోరారు.ఇలాంటి రూమర్లకు స్పందించి తన సమయం, ఆరోగ్యం, ఎనర్జీని వృథా చేసుకోవాలని తనకు లేదని, పాజిటివ్గా జీవించడమే తన లక్ష్యమని మీనా స్పష్టం చేశారు. “కర్మ అనేది ఉంటుంది అని అది ఎవరినీ వదిలిపెట్టదు” అనే ఆమె మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్గా ఉండే మీనా ఇలా ఫైర్ అవ్వటం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆగిపోవాలని ఆమె స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టే భావించాలి.

# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్

తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న ‘ద బ్లఫ్’ సినిమాలోని ‘బ్లడీ మేరీ’ పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్లెట్గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు.పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యువెలరీ డిజైనర్లు చెబుతున్నారు. చాలామంది పురుషులు ఇప్పుడు తమ సంబంధాల్లో సమానత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే ఇలాంటి ఆభరణాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని ‘డిఐ డిజైన్స్’ ఫౌండర్ దిశా షా పేర్కొన్నారు. త్వరలోనే పురుషుల కోసం ప్రత్యేకంగా మంగళసూత్ర కలెక్షన్ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. లోకమంతా టెక్నాలజీ, ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా.. తమ మూలాలను, ఎదుటివారి సంస్కృతిని గౌరవించడమే నిజమైన ప్రేమ అని నిక్ జోనస్ నిరూపించారు. కేవలం సినిమా ప్రమోషన్ కోసం కాకుండా, మనసు నిండా ఉన్న ప్రేమతో ఆయన చేసిన ఈ పనికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పెళ్లి ఉంగరాలను ఇంట్లో మర్చిపోయే భర్తల కంటే, ఇలా భార్య సంస్కృతిని సొంతం చేసుకునే నిక్ జోనస్ లాంటి భర్తలు కావాలంటూ మహిళలు కామెంట్స్ చేస్తున్నారు.





# లెజెండ్స్ అపూర్వ కలయిక

భారతీయ సినిమా లివింగ్ లెజెండ్స్ కమల్హాసన్, రజనీకాంత్ 47 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలిసి నటించబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక సినిమా అప్డేట్స్ కోసం యావత్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. రెడ్ జాయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రానికి ‘కెహెచ్ డ ఆర్కే’ అనే వర్కింగ్ టైటిల్ను పెట్టారు. 70వ దశకంలో రజనీకాంత్, కమల్హాసన్ కలిసి నటించారు. అనంతరకాలంలో వారిద్దరూ భారతీయ సినిమాలో తిరుగులేని స్టార్డమ్తో లెజెండ్స్గా ఎదిగారు. ఈ సందర్భంగా రెడ్ జాయింట్ మూవీస్ ప్రతినిధి మాట్లాడుతూ ‘ఇదొక చారిత్రక ఘట్టం. ఇద్దరు దిగ్గజ నటులతో సినిమా చేయటం గొప్ప బాధ్యతగా భావిస్తున్నాం. మా కల నిజమైన అనుభూతి కలుగుతున్నది. భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం’ అన్నారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్నందిస్తున్నారు.

# అండర్ 18... ఐశ్వర్య రాజేశ్ కొత్త సినిమా

## ఐశ్వర్య రాజేశ్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో రానున్న కొత్త సినిమా



ప్రముఖ నటి ఐశ్వర్య రాజేశ్, నటుడు విక్రాంత్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి ‘అండర్ 18’ అనే టైటిల్ను ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ లుక్ను ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ ఆవిష్కరించడం విశేషం. ఈ చిత్ర దర్శకుడు కార్తీక్ పెరుమాల్సామి గతంలో వెట్రిమారన్ దగ్గర అసోసియేట్ డైరెక్టర్గా పనిచేశారు.ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్పై బి. జగదీశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘మద్రాస్కారన్’ విజయం తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రమిది. ‘అండర్ 18’ సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఒక ఎమోషనల్ క్రైమ్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. నేరం కారణంగా ప్రభావితమైన ఒక కుటుంబం యొక్క భావోద్వేగాలను, క్రైమ్ ప్రపంచంలోని క్రూరమైన కోణాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని అంతగా వెలుగులోకి రాని కొన్ని నేరాల నేథ్యాన్ని దర్శకుడు ఈ కథ కోసం ఎంచుకున్నారని సమాచారం. సామాజిక వాస్తవికత, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కిశోర్తో పాటు పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. హోసూర్, చెంగల్పట్టు, చెన్నైలోని వాస్తవ లొకేషన్లలో చిత్రీకరణ జరపనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు వేల్రాజ్ కెమెరామ్యాన్గా పనిచేస్తుండగా, సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తున్నారు. ఇళంగో కృష్ణన్, కార్తీక్ నేతా పాటలకు సాహిత్యం అందిస్తున్నారు.